క్లుప్తంగా

వీఎంసీ ఏడీహెచ్ బదిలీ

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ ఉద్యానవన విభాగం అధికారిగా విధులు నిర్వహిస్తున్న బి. శ్రీనివాసును ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన్ను కర్నూలు ఉద్యానవన విభాగం అధికారిగా బదిలీ చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది డిసెంబర్‌లో ఇక్కడికి వచ్చిన శ్రీనివాసు ఏడాదిపాటు వీఎంసీలో విధులు నిర్వహించారు.

ఏఈకి షోకాజ్ నోటీసు

ఉద్యానవన విభాగంలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న పుల్లారావుకు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వంగా వ్యవహరించడం, ఇటీవల ఎకలెక్టర్ ఢిల్లీరావు రాజీవ్‌గాంధీ పార్కును సందర్శించిన సందర్భంలో పార్కులో వాటర్‌పాండ్ మురికిగా ఉండటం, ఎక్కడపడితే అక్కడ మట్టిని వదిలేయటం అక్కడ సమస్యలు తీర్చాలని కమిషనర్ ఆదేశించినా వాటిని పరిష్కరించకపోవడంతో షోకాజ్ నోటీసులు అందించారు.

సచివాలయాల్లో రుణమాఫీ గ్రూపుల జాబితా

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఆర్థిక చేయూత అందించడానికి పొదుపు సంఘాల రుణాల మొత్తాన్ని తీర్చడానికి చర్యలు తీసుకుంటోందని వీఎంసీ పట్టణ సాధికారాభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి శకుంతల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రెండు విడతలుగా గ్రూపుల ఖాతాలకు సొమ్ము జమ చేశామని, మూడో విడతకు అర్హత ఉన్న గ్రూపుల జాబితాను సోషల్ ఆడిట్‌లో ఉంచామని, నగరంలోని అన్ని సచివాలయాల్లో జాబితా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. జాబితాల్లో మార్పులు, చేర్పులు ఉంటే ఈ నెల 8వ తేదీ సాయంత్రంలోపు వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని యూసీడీ విభాగంలో సమర్పించాలని సూచించారు.

యువతి కనిపించడం లేదని ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి కనిపించడం లేదని ఆమె తల్లి గురువారం కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేఎల్‌రావునగర్ కుండల మార్కెట్‌కు చెందిన ఆలజింగి జయలక్ష్మి, చిన్నారావు భార్యభర్తలు. వీరికి నలుగురు సంతానం. ఆమె భర్త చిన్నారావు పదేళ్ల క్రితం మరణించాడు. మూడో కుమార్తె ప్రేమలత కేర్ టేకర్‌గా పని చేస్తుంది. ఆమె కొంత కాలంగా వైఎస్సార్ కాలనీకి చెందిన మహీధర్‌ను ప్రేమిస్తోంది. ఈ నెల రెండో తేదీ రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రేమలత తిరిగి రాకపోవడంతో ఆమె తల్లి ఆందోళనకు గురైంది. 3వ తేదీ రాత్రి ప్రేమలత తన అక్కకు ఫోన్ చేసి తాను హైదరాబాద్‌లో ఉన్నట్లు పేర్కొంది. దీంతో తల్లి జయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు.

12న వాహనాల వేలం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు ఈ నెల 12న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు జరిగే వేలంలో పాల్గొనాలనుకునేవారు ద్విచక్ర వాహనానికి రూ. 5 వేలు, నాలుగు చక్రాల వాహనాలకు రూ. 10 వేల డిపాజిట్ కట్టాలని పాడుకున్న వారు 18 శాతం జీఎస్టీ చెల్లించాలని తెలిపారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పనికి వెళ్లిన తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీకి చెందిన మహ్మద్ ఆసిఫా, రేహుతుల్లా భార్యభర్తలు. రేహుతుల్లా సైకిల్ షాపు నిర్వహిస్తుండగా, ఆసిఫా ఇంటి ముందు టిఫిన్ బండి నడుపుతుంటుంది. డిసెంబర్ 31న ఖమ్మంలో పని ఉందని చెప్పి వెళ్లిన రేహుతుల్లా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బంధువులు, స్నేహితులను అడిగినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మాదక ద్రవ్యాల నియంత్రణపై దృష్టి

భవానీపురం(విజయవాడపశ్చిమ): గ్రామాల్లో మద్యం అక్రమ రవాణా, నాటు సారా తయారీ, మాదక ద్రవ్యాల వినియోగ నియంత్రణపై దృష్టి సారించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో భవానీపురం స్టేషన్ హౌస్ ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. విజయవాడ రూరల్ నున్న, షాబాద్, కొత్తూరు తాడేపల్లి తదితర గ్రామ సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులతో ఆయన గురువారం స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి సమాచారం అందించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్) అక్రమ రవాణాను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డీసీపీ మోకా సత్తిబాబు నేతృత్వంలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని, ప్రతి మహిళా పోలీస్ ఇందులో భాగస్వాములై ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగానికి సంబంధించి కాలేజీ, హైస్కూల్ విద్యార్థులు, ఆకతాయి మూకలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. మీ సచివాలయాల పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు.

అర్హతే ప్రామాణికంగా పింఛన్లు

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



లబ్ధిదారులకు పెన్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే , వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. చిట్టినగర్ సొరంగం రోడ్డులోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతనంగా మంజూరైన పెన్షన్లను ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నియోజక వర్గంలోని 37, 38, 46, 47,48,49,51,53,54వ డివిజన్లలోని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 39 లక్షల మందికి పింఛన్లు ఇస్తే.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత 66.50 లక్షల మందికి ప్రతి నెలా లబ్ధిదారుల ఇంటి గుమ్మం వద్దే పింఛన్లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రెహమ్మతున్నీసా, మహాదేవు అప్పాజీరావు, గోదావరి గంగ, అత్తులూరి ఆదిలక్ష్మితోపాటు, యూసీడీ ప్రాజెక్టు ఆఫీసర్ శకుంతల, సీడీవో దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాటి రాంబాబు, వెన్నం రజనీకుమార్, కూరాకుల నాగతో పాటు పలు డివిజన్ల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరింత మెరుగైన విద్యకే ట్యాబ్‌లు

కలెక్టర్ ఢిల్లీరావు



ట్యాబ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులకు మరింత మెరుగైన విద్యను అందించడానికి ట్యాబ్‌లు దోహదపడతాయని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. నగరంలోని బిషప్ అజరయ్య హైస్కూల్‌లో గురువారం 8వ తరగతి విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల పని తీరు, విద్యార్థులు ఉపయోగిస్తున్న విధానాన్ని కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు డిజిటల్ విద్యను అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేసిందన్నారు. జిల్లాలో 8వ తరగతి చదువుతున్న 14 వేల మందికి పైగా విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశామన్నారు. కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీ పడి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. బయాలజీ సబ్జెక్టుకు సంబంధించి కొన్ని అంశాలను విద్యార్థులకు కలెక్టర్ బోధించారు. టెన్త్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సీవీఆర్ స్కూల్లో పనులు పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని లేకపోతే బిల్లు చెల్లించబోమని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ స్పష్టం చేశారు. నగర పర్యటనలో భాగంగా గురువారం ఆయన 23వ డివిజన్ సీవీఆర్ హైస్కూల్లో నాడు-నేడులో జరుగుతున్న రూ.1.50 కోట్ల పనులను ఆయన పరిశీలించారు. పాఠశాల నూతన భవనాన్ని, నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పలు ఆధునికీకరణ పనులను ఆయన ఇంజినీరింగ్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. అనంతరం ఆయన 62, 64వ డివిజన్లలో డ్రెయిన్లను పరిశీలించారు. ఈ పర్యటనలో డీఈ గురునాథ్, ఇతర అధికారులు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

మంచినీటి పైప్‌లైన్ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఆదిలక్ష్మి, అధికారులు, పార్టీ నాయకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొండ శివారు ప్రాంతవాసుల తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లో రూ.9.30 లక్షల వ్యయ అంచనాతో చేపట్టిన మంచినీటి పైపులైన్ పనులను గురువారం కార్పొరేటర్ పరిశీలించారు. తొలుత బంగారయ్య కొట్టు వీధిలోని బూస్టర్ వద్ద ఏర్పాటు చేస్తున్న మోటర్లను పరిశీలించి వాటి కెపాసిటి వివరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంచినీటి పైపులైన్ల పనులను పరిశీలించారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వంలో కొండపై భాగంలో తాగునీటి సరఫరాకు కొన్ని ఫిర్యాదులు వచ్చాయని, వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. గత నెల 21న ప్రారంభించామని, నెలాఖరుకు పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు డీఈ శివాజీ, ఈఈ నారాయణమూర్తి, ఏఈ అహ్మద్‌లతో పాటు వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షులు పిల్లా సూరిబాబు, వరలక్ష్మి, బాయన అమర్‌నాథ్, గాలి గురుప్రసాద్, ఆర్.శ్రీనుపాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



పరీక్ష చేస్తున్న డాక్టర్ అచ్యుతబాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రూరల్ మండలం గొల్లపూడి పంచాయతీ పరిధిలోని వాసవి ఫార్మా మార్కెట్ కాంప్లెక్స్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గొల్లపూడిలోని ఆంధ్రహాస్పటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో గుండె, కిడ్నీ, షుగర్ సంబంధిత పరీక్షలతోపాటు బ్లడ్ ప్రెజర్ పరీక్షలు చేశారు. గుండె డాక్టర్ రమేష్ ఎకో పరీక్షలు, డాక్టర్ అచ్యుతబాబు కిడ్నీ పరీక్షలు చేసి పేషెంట్లకు పలు సూచనలు చేశారు. వాసవి ఫార్మా మార్కెట్ కాంప్లెక్స్ కార్యదర్శి దేవతి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యం అన్న ఆర్యోక్తిని అనుసరించి తాము కాంప్లెక్స్‌లోని మెడికల్ వ్యాపారస్తులు, సిబ్బందితో పాటు స్థానిక ప్రజలకుకూడా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శివప్రసాద్, నాగేశ్వరరావు, చెన్నకేశవులు, లక్ష్మణరావు, మణికంఠ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

8న గోదా కల్యాణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ ఇందిరా ఎన్‌క్లేవ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల 8వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఇందిరా ఎన్‌క్లేవ్‌లో గోదా కల్యాణం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కె సాంబశివరాజు, కె.వేణుగోపాలరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్లుగా ధనుర్మాసోత్సవాల్లో భాగంగా కల్యాణం చేస్తున్నామని పేర్కొన్నారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రలు

నున్న(విజయవాడరూరల్): ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం పలు గ్రామాల్లో విఫ్స్ ప్రోగ్రామ్(వీక్లీవస్స్)జరిగింది. ఈ సందర్భంగా హైస్కూల్లో విద్యార్థులకు, ఎలిమెంటరీ స్కూల్స్ విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత ఉన్న వారికి ఐరన్ టాబ్లెట్స్‌ను వైద్య సిబ్బంది అందజేశారు. నున్న గ్రామంలో జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థులకు, పాతపాడు, మంగళాపురం, గ్రామాల్లో ఎలిమెంటరీ స్కూల్స్ విద్యార్థులకు టాబ్లెట్లు అందజేశారు.

మేధో సంపత్తి హక్కులపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న డాక్టర్ రాఘవరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు మేధో సంపత్తి హక్కులు తదితర అంశాలపై పట్టు సాధించాలని కేఎల్ విశ్వవిద్యాలయం పెటెంట్ ఫెసిలిటేషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రాఘవరావు అన్నారు. కేబీఎన్ కళాశాల మ్యాథ్‌మెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'మేధో సంపత్తి హక్కులు' అంశంపై సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మేధో సంపత్తి హక్కులకు చట్టపర రక్షణ లభిస్తుందన్నారు. కాపీరైట్, పేటెంట్లు, ట్రేడ్ మార్కులు, ట్రేడ్ సీక్రెట్లు వంటివన్నీ విభాగంలో ఉన్నాయన్నారు. న్యాయ వ్యవస్థలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు జరుగుతున్న మార్పులపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ అధ్యాపకులు లక్ష్మీప్రసన్న, సీహెచ్ రాధిక, డాక్టర్ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు విద్యార్థినికి జేఎన్‌టీయూ గోల్డ్‌మెడల్



లక్ష్మీస్రవంతిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థిని సొంతన్య తనూజలక్ష్మీస్రవంతికి జేఎన్‌టీయూ కాకినాడ.. బంగారు పతకాన్ని ప్రకటించిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. తనూజలక్ష్మీస్రవంతి తమ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ పూర్తి చేసిందని పేర్కొన్నారు. ఆమెకు ఈఈఈ విభాగానికి సంబంధించి జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ కాకినాడ టాపర్‌గా నిలిచిందని, బంగారు పతకాన్ని అందిస్తున్నట్లు ప్రకటించిందని పేర్కొన్నారు. త్వరలో జరిగే విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో బంగారు పతకాన్ని ప్రదానం చేయనున్నట్లు విశ్వవిద్యాలయం తెలియజేసిందని వివరించారు. ఈ సందర్భంగా తనూజలక్ష్మీస్రవంతిని కళాశాల కార్యదర్శి లక్ష్మణస్వామి, కోశాధికారి వెంకటేశ్వరరావు అభినందించినట్లు పేర్కొన్నారు. తమ కళాశాల వంద శాతం ఉత్తీర్ణత, నూరుశాతం ప్లేస్‌మెంట్‌తో విద్యా బోధన అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ పతాంజలిశాస్త్రి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ వైద్యుల సంఘానికి నూతన కార్యవర్గం



డాక్టర్ పి.శ్వేత



డాక్టర్ కేఎస్సాఆర్ భార్గవ

లబ్బీపేట(విజయవాడ తూర్పు): అసోసియేషన్ ఆఫ్ ఓటో రైనో లారింగాలజిస్ట్స్ ఇండియా-ఏఓఐ(అఖిల భారత చెవి ముక్కు గొంతు వైద్యుల సంఘం) విజయవాడ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గవర్నర్‌పేటలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో 2023-24కు నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలిగా డాక్టర్ పి.శ్వేత, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ప్రదీప్, కార్యదర్శిగా డాక్టర్ కేఎస్సార్ భార్గవ్, సహకార్యదర్శిగా డాక్టర్ పవన్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ సమీర నియమితులయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా డాక్టర్ సుధ, డాక్టర్ అఖిల సుల్తానా, డాక్టర్ వెంకయ్య, డాక్టర్ దినేష్ ఎన్నికయ్యారు. రిటర్నింగ్ అధికారిగా డాక్టర్ శివరామకృష్ణ వ్యవహరించారు. 2022-23కు సంఘ అధ్యక్ష కార్యదర్శులుగా చేసిన డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ శ్వేత అందించిన సేవలను కొనియాడారు. సంఘం కార్యక్రమాలను సమాజంలోకి తీసుకు వెళ్లడానికి పూర్తి నిబద్ధతతో పని చేస్తామని నూతన అధ్యక్షురాలు డాక్టర్ శ్వేత తెలిపారు.

ప్రజలకు చేసిన మంచే గెలిపిస్తుంది

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెలంపల్లి



పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్

వించిపేట(విజయవాడపశ్చిమ): ప్రజలకు చేసిన మంచే వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపిస్తుందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా 49వ డివిజన్ 169వ సచివాలయ పరిధిలో స్థానిక కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్, పలు శాఖల అధికారులతో కలసి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరు, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో ఇళ్లు లేని ప్రతి ఒక్కరికీ ఇళ్లతో పాటు ప్రభుత్వం నుంచి అన్ని పథకాలు అందుతున్నాయని వారు చెప్పడం సంతోషంగా ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అర్హతే కొలమానంగా పార్టీలు, కుల, మతాలకు అతీతంగా తమకు ఓటు వేయని వారికి సైతం పథకాలు అందిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. 49వ డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీలు ఇప్పటికే పూర్తిచేశామని, కొన్ని విద్యుత్ స్తంభాల సమస్యలు స్థానికులు తెలపడంతో వెంటనే వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఏ ఇంటికి వెళ్లినా రానున్న జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు ఆశీర్వదిస్తున్నారని తెలిపారు.

రాష్ట్రంలో ప్రతిపక్షమే లేదు...

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రతిపక్షమే లేదని ఎమ్మెల్యే వెలంపల్లి అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకి ప్రజాదరణ లేక టోకెన్‌లు ఇచ్చి తన సభలకు జనాలను తరలిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు తన ప్రచార సభలో వెంటవెంటనే 11 మంది ప్రజల ప్రాణాలు పోతే కనీసం పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ రాష్ట్రానికి పట్టిన చీడపురుగులని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గౌడుపేరు సుధీర్, సీనియర్ నాయకులు చేపూరి శ్రీనివాసరావు, బూదాల శ్రీనివాసరావు, ఎర్రజొన్న విజయలక్ష్మి, జార్జి, ప్రమీల వీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

● ఆకట్టుకున్న గులాబీల ప్రదర్శన

నగరపాలక సంస్థ, హరితప్రియ ప్లాంట్ లవర్స్ సొసైటీ, రోజ్ సొసైటీ ఆఫ్ ఏపీ సంయుక్త ఆధ్వర్యంలో పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లోని రాష్ట్రస్థాయి అగ్రి ఆర్టికల్చర్ షో, ఐదో వార్షిక గులాబీ ప్రదర్శన ఆకట్టుకుంటోంది. దీన్ని గురువారం కలెక్టర్ ఢిల్లీరావు, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీసీపీ మేరీ ప్రశాంతి ప్రారంభించారు. వివిధ రకాల గులాబీ మొక్కలు, పూలమొక్కలు కనువిందు చేస్తున్నాయి.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







వ్యాధిపీడితులకు నాణ్యమైన వైద్యసేవలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సుహాసిని

ఆటోనగర్(విజయవాడతూర్పు): వ్యాధిపీడితులకు నాణ్యమైన వైద్యసేవలు అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్) లకు సూచించారు. ఏపీఐఐసీ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఎంఎల్‌పీహెచ్‌ల రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. సుహాసిని మాట్లాడుతూ చెవి, గొంతు, ముక్కు తదితర వ్యాధులతో పాటు మానసిక సమస్యలు బారిన పడిన వారిని గుర్తించి మెరుగైన వైద్యసేవలను అందించడానికి కృషి చేయాలన్నారు. ఆరోగ్య సమస్యలతో పాటు తదితర అంశాలపై మిడిలెవల్ హెల్త్ ప్రొవైడర్‌లకు అర్థమయ్యే రీతిలో వివరించారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ నవీన్, వైద్యులు సుష్మా, కల్యాణ్, నరేష్, వాసంతి తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి పరిచారక సుధాకర్ మృతి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో పరిచారకగా విధులు నిర్వహిస్తున్న మాజేటి సుధాకర్ శాస్త్రి(43) గురువారం కాలేయ సంబంధిత వ్యాధితో మృతి చెందారు. సుధాకర్ రెండు దశాబ్దాలుగా అమ్మవారి అలంకరణ చేస్తున్నారు. దసరా ఉత్సవాలు, విశేష పర్వదినాల్లో అమ్మవారికి విశేష అలంకారంలో సుధాకర్ సహాయకులుగా విధులు నిర్వహిస్తుంటారు. రామకృష్ణాపురంలో నివసిస్తున్న సుధాకర్‌కు భార్య కల్యాణి, ఇద్దరు సంతానం. రెండో కుమారుడు మధుకర్ మానసిక దివ్యాంగుడు. సుధాకర్ అంతిమ యాత్ర గురువారం సాయంత్రం నిర్వహించగా, దేవస్థాన అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

13 నుంచి సంక్రాంతి ఉత్సవాలు

రామవరప్పాడు: రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 13 నుంచి సంక్రాంతి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి పాతూరి లోకేశ్వరి, చైర్మన్ బోయిన భాను ప్రదీప్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కోవిడ్ నిబంధనలను పాటిస్తూ ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా సంక్రాంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 12న అమ్మవారికి పుట్టింటి వారసులతో పసుపు, కుంకుమ నూతన వస్త్రాల బహూకరణ జరుగుతుందన్నారు. 13న భోగి సందర్భంగా ఉదయం 5గంటల నుంచి ఆలయ దర్శనం, వాహన పూజలు, మొక్కుబడులు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 14 మకర సంక్రాంతి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అదే రోజు సాయంత్రం గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 18న ఆలయ సమీపంలోని రైవస్ కాలువలో తెప్పోత్సవం, రాత్రి రావిచెట్టు ఎదుట పూలంగి (ఊయల) సేవ ఉంటుందన్నారు. 20న అన్నసంతర్పణ జరుగుతుందని తెలిపారు.